

మాట్లాడుతున్న పీడీ హైమావతి, చిత్రంలో డీఈవో సుబ్రహ్మణ్యం, ఏపీసీ అనురాధ తదితరులు

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ హైమావతి, సమగ్రశిక్షా ఏపీసీ అనురాధ పేర్కొన్నారు. మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయంలో బాలల హక్కులు, విద్యాహక్కు చట్టం అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల నడతను తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. బాల్యవివాహాల నిర్మూలనకు సమన్వయంతో పనిచేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలని, పిల్లలను చరవాణులకు దూరంగా ఉంచాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలని, కౌమర దశలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. డీఈవో సుబ్రహ్మణ్యం, ఈగల్ ఆర్గనైజర్ శ్రీనివాసులు, సీడీపీవోలు, సీఆర్‌పీలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మండలాల అభివృద్ధికి కార్యాచరణ

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మండలాల అభివృద్ధికి గ్రామాల్లో ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని ఎంపీడీవోలను జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి అమర్‌నాథ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో నిర్వహించిన జిల్లాలోని ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా పరిశీలించాలన్నారు. ఇంటింటా నిత్యం తడి, పొడి చెత్త సేకరణ తప్పకుండా జరిగేలా చూడాలన్నారు. స్వచ్ఛరథాలతో వ్యర్థరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నాగరాజు పాల్గొన్నారు.

హైదరాబాదుకు వెళ్లిన కలికిరి పోలీసులు

కలికిరి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ సోదరుడు రాజేందర్ (59) మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన భార్య వసంత సైబరాబాద్ పరిధిలోని దుండిగల్ పోలీస్ స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అక్కడి పోలీసులు కేసును కలికిరికి బదలాయించడంతో మంగళవారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం సీఐతో పాటు ఏఎస్సై మధుసూదనాచారి, సిబ్బంది హైదరాబాదుకు తరలివెళ్లారు. అనంతరం రాజేందర్ మృతదేహానికి శవ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

చనిపోతున్నా.. వెతకవద్దంటూ పోస్టు

వ్యక్తిని గుర్తించి రక్షించిన పోలీసులు

పుంగనూరు గ్రామీణం: వనమలదిన్నె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అప్పు చేసి లారీ కొన్నాడు. కంతులు సరిగా కట్టలేక తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం ఆత్మహత్య చేసుకునేందుకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. 'నేను చనిపోతున్నాను, నన్ను వెతకొద్దు' అంటూ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పోస్టు చేశాడు. వారు పోలీసులకు తెలపడంతో అప్రమత్తమైన సీఐ సుబ్బారాయుడు, ఎస్సైలు అన్సార్‌బాషా, కె.వి.రమణ, పోలీసులు సాంకేతికత సాయంతో రెండు బృందాలుగా విడిపోయి గాలించి చంద్రశేఖర్‌ను గుర్తించి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అతనికి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యూట్యూబ్ వీడియోలు చూసి.. మటన్ దుకాణంలో కత్తితెచ్చి

ప్రియుడిని హతమార్చిన తల్లీ కుమారులకు రిమాండ్

జీడిమెట్ల, న్యూస్‌టుడే: ఓ వ్యక్తిని ఎలా చంపాలి.. హత్య తర్వాత ఆధారాలు దొరకకుండా మృతదేహాన్ని ఎలా మాయం చేయాలి.. అని యూట్యూబ్‌లో వీడియోలు చూసి పక్కాగా ప్లాన్ చేశాడు. చివరకు మృతదేహాన్ని తరలించే ప్రయత్నంలో పోలీసులకు చిక్కి, తల్లితో సహా కటకటాల పాలయ్యాడు. జీడిమెట్లలో సంచలనం సృష్టించిన శివారెడ్డి హత్యకేసులో మంగళవారం జీడిమెట్ల ఠాణాలో కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన అరుణ భర్త మృతిచెందడంతో అన్నమయ్య జిల్లాకు చెందిన శివారెడ్డి (40)తో కలిసి చింతల్‌లో సహజీవనం చేస్తోంది. ఆమెకు ఇదివరకే సాయిరత్నం (19) కుమారుడున్నాడు. శివారెడ్డి నిత్యం మద్యం తాగి తల్లీ కుమారులను వేధిస్తుండటంతో ఇద్దరూ కలిసి అతన్ని ఆదివారం రాత్రి కత్తితో నరికి చంపిన విషయం తెలిసిందే. అయితే పథకం ప్రకారం హత్య చేసినట్లు తెలుస్తోంది. సాయిరత్నం యూట్యూబ్‌లో పలు క్రైమ్ వీడియోలు చూసి పక్కా ప్రణాళిక రచించాడు. ముందుగా ఇంటి పక్కనున్న మటన్ దుకాణం నుంచి కత్తి తెచ్చుకున్నాడు. రాత్రి 11 గంటలకు శివారెడ్డి నిద్రపోయాక కత్తితో మెడపై నరికాడు. రక్తపు మరకలున్న దుస్తులను తీసుకెళ్లి నాలాలో పడేశారు. తర్వాత ప్లాస్టిక్ డ్రమ్ములో మృతదేహాన్ని కుక్కి, ఎవరికీ తెలియకుండా మాయం చేసేందుకు ప్లాన్ చేశారు. గది నుంచి బయటకు తరలించేందుకు స్నేహితుడికి ఫోన్ చేయగా అతను వచ్చి మృతదేహాన్ని చూసి.. ఒక్కసారిగా భయపడి నేరుగా ఠాణాకు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. శివారెడ్డి హత్య చేసినట్లు కత్తితో ఫొటోలు వీడియోలు చిత్రీకరించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి ఫోన్ పరిశీలించంగా అందులో పలు చిత్రాలు, వీడియోలు దొరికాయని వెల్లడించారు.

వసతి గృహాలు పిలుస్తున్నాయ్!

వచ్చే విద్యా సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ

చిన్నమండెం, న్యూస్‌టుడే: పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం వసతి గృహాలను ఏర్పాటు చేసింది. ఇందులో అన్ని రకాల వసతులు విద్యార్థులకు కల్పిస్తున్నారు. ఈ తరుణంలో వచ్చే విద్యా సంవత్సరానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ఆయా శాఖల వసతి గృహాల జిల్లా అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వసతి గృహాల్లో చిన్నపాటి మరమ్మతులకు కూడా పైసా నిధులు ఖర్చు చేయలేదు. దీంతో ఏటికేడు విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఈ తరుణంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. వసతిగృహాల బాగుకు నిధులు మంజూరు చేసింది. కొన్ని చోట్ల మరమ్మతులు చేయించడం, అవసరమైన చోట కొత్త భవనాలను, మరుగుదొడ్లను నిర్మించింది. ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయించింది. దాదాపు అన్ని పనులు పూర్తి కావడంతో వసతి గృహాల రూపురేఖలు మారిపోయాయి. జూన్ 12న కొత్త విద్యా సంవత్సరం మొదలవుతున్న తరుణంలో విద్యార్థుల సంఖ్య పెరగనుంది.

వసతి గృహం	సీట్లు	ఖాళీలు
సాంఘిక సంక్షేమ	4,450	1,700
వెనుకబడిన తరగతులు	3,450	1,834
పోస్టుమెట్రిక్ (బీసీ)	1000	533
ఎస్టీ గురుకులాలు	2,560	1,779
పోస్ట్ మెట్రిక్	200	104

సన్నబియ్యంతో భోజనం

వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం ఇస్తున్నారు. ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో మూడు నుంచి పదో తరగతి వరకు, పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో ఇంటర్ నుంచి పీజీ వరకు గల విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు, పెట్టెలు, రాత పుస్తకాల వంటివి పంపిణీ చేస్తున్నారు. మూడో తరగతి నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వార్డెన్లు ప్రచారం మొదలు పెట్టారు.



చిన్నమండెంలోని ఎస్సీ బాలుర వసతిగృహం

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

జూన్ 12న పాఠశాలలు మొదలవుతాయి. ఆలోగానే వసతి గృహాల్లో ఉండాలనుకొన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి. ఇప్పటికే వసతిగృహాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం. ఆసక్తి గల విద్యార్థులు ఆయా ప్రాంతాల్లోని వసతిగృహాల వార్డన్లు లేదా స్వర్ణవార్డు, స్వర్ణ గ్రామ సంక్షేమాధికారులకు దరఖాస్తులను అందజేయాలి. **- దామోదరరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి, తేజస్విని, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి, అన్నమయ్య జిల్లా**

కైలాసగిరి.. సౌర సిరి

- జలాశయంలో తేలియాడుతూ కనువిందు
- 4 మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన



నీటిలో తేలియాడుతూ కనువిందు చేస్తున్న సోలార్ ప్రాజెక్టు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తిరుపతి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్‌సీసీఎల్) ఆధ్వర్యంలో నీళ్లపై తేలియాడే సౌర ప్రాజెక్టు దేశవ్యాప్తంగా గుర్తింపును సంతరించుకుంది. తిరుపతి నగరానికి తాగునీరు అందిస్తున్న రామాపురం సమీపంలోని కైలాసగిరి జలాశయంలో వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నిరంతరాయంగా 4 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తితో మరింత ప్రాచుర్యాన్ని పొందుతుండటం విశేషం.

రూ.22 కోట్లతో అభివృద్ధి..: ఎల్అండ్‌టీ సంస్థ నేతృత్వంలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. రూ.22 కోట్లతో ఈ పనులు పూర్తి చేయడంతో పాటు నాలుగు మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన జరుగుతోంది. ఎండ తీవ్రతకు నీళ్ల ఆవిరి కాకుండా కాకుండా నీటిపై తేలియాడే పద్ధతిలో ఏర్పాటు చేసిన సౌర ప్రాజెక్టు.

నిరంతర పర్యవేక్షణ..: దేశంలోనే నీళ్లపై తేలియాడే ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన ఇక్కడి సౌర ప్రాజెక్టు పర్యవేక్షణకు స్మార్ట్‌సిటీ యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. నిరంతర పర్యవేక్షణలో అక్కడే కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం, నిపుణులను అందుబాటులో ఉంచడం, రోజువారీ తనిఖీలు, విద్యుత్తు ఉత్పాదనకు ఎలాంటి అడ్డంకులు లేకుండా పర్యవేక్షిస్తున్నారు. మూడేళ్ల క్రితం వరుస తుపాన్ల కారణంగా జలాశయం పూర్తిగా నిండింది. ఈదురుగాలుల తీవ్రతతో నీళ్లపై పెరిగిన ఒత్తిడి దృష్ట్యా ప్రాజెక్టు చుట్టూ అమర్చిన దారాలు తెగిపోవడంతో సౌరఫలకాలు దెబ్బతిన్నాయి. రూ.2 కోట్లతో వీటిని పూర్తిగా మార్పు చేసి మళ్లీ ఆధునికీకరించారు.

- ప్రాజెక్టు: టీఎస్‌సీసీఎల్ సోలార్ పవర్ ప్రాజెక్టు
- వ్యయం: రూ.22 కోట్లు
- నిర్మాణం: కైలాసగిరి జలాశయం (రామాపురం)
- జలాశయ విస్తీర్ణం: 2500 ఎకరాలు
- సౌరఫలకాల ఏర్పాటు: 12 ఎకరాలు
- ప్రయోజనం: 4 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి, నీరు ఆవిరి కాకుండా చూడటం
- ప్రత్యేకత: దేశంలో ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుగా గుర్తింపు

ప్రత్యేక ఆకర్షణ..: ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో జలాశయం మరింత ఆకర్షణీయంగా కన్పిస్తుంది. రెండు పర్వతాల మధ్యలోని జలాశయంలో చూపరులను ఆకట్టుకునేలా, పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవిలో జలాశయంలో నీటి నిల్వలు తగ్గినప్పుడు, అలాగే వర్షాకాలంలో నీటి ఉద్ధృతి పెరిగినప్పుడు సౌర ఫలకాలకు ఇబ్బంది రాకుండా ప్రత్యేక సాంకేతిక పద్ధతులు అవలంబిస్తున్నారు. దీంతో దేశంలోనే ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తింపు సంతరించుకుంది.

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో 2026-27 విద్యాసంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ మదన్‌మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. డిప్లొమా కోర్సు పూర్తి చేసిన వారికి మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలున్నాయని తెలిపారు.

'తప్పుడు పత్రాలతో ఖాతాలు సృష్టించిన వైకాపా నాయకులు'

ఈనాడు, అమరావతి: ఇద్దరు వైకాపా నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు పత్రాలతో అక్రమంగా భూ ఖాతాలు సృష్టించారని పుంగనూరు మండలం మంగళం గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ మన్నెం ధర్మవరం సుబ్బారెడ్డిలకు వినతిపత్రం అందించారు. తప్పుడు పత్రాలతో విలువైన భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ❖ వీఆర్వో లంచం తీసుకుని తన భూమిని వేరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, న్యాయం చేయాలని చిన్నమండెం గ్రామానికి చెందిన వెంకట రమణ కోరారు. ❖ 1985లో హరిజన డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం తనకు కేటాయించిన భూమిని.. కోర్టు తీర్పు ఇచ్చినా అప్పగించడంలేదని సంబేపల్లికి చెందిన వెంకటరమణ వినతిపత్రం ఇచ్చారు. ❖ 70 ఏళ్లుగా సాగు చేస్తున్నా రికార్డుల్లో కాలువ పోరంబోకు అని ఉండటంతో పట్టాలు లేక ప్రభుత్వ రాయితీలు, రుణాలు అందక పలు కుటుంబాలు ఇబ్బంది పడుతున్నామని అన్నమయ్య జిల్లా గుంతలపేట గ్రామానికి చెందిన శివశంకర్ అర్జీ ఇచ్చారు.

పేదల గుండెల్లో నిలిచిన నేత పాలకొండ్రాయుడు

రాయచోటి, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన దివంగత మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. పాలకొండ్రాయుడి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం గాలివీడు రోడ్డులోని ఆయన సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. పార్లమెంట్ సభ్యుడిగా, ఎమ్మెల్యేగా రాయచోటి నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలు చరిత్రలో నిలిపోతాయన్నారు. ప్రజా సేవే ధ్యేయంగా బదుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పని చేశారన్నారు.



నివాళులర్పిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పది కంట్రోల్ బూత్‌లు: ఎస్పీ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మదనపల్లెలో ట్రాఫిక్ నియంత్రణకు పది కంట్రోల్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. మంగళవారం స్థానిక అన్నమయ్య కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లె పట్టణం జిల్లాలోనే అతి పెద్ద వ్యాపార కేంద్రంగా ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ సవాలుగా మారిందన్నారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది ఎండావానల్లో ఇబ్బంది పడుతుండటంతో వారి రక్షణకు పది ట్రాఫిక్ కంట్రోల్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని అన్ని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు లేని పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం ట్రాఫిక్ బూత్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, డీఎస్పీ పావని, ట్రాఫిక్ సీఐ గురునాథ్, ఎస్‌బీ సీఐ రాజారమేష్, మదనపల్లె ఒకటో పట్టణ సీఐ రాజారెడ్డి, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ రవి, ఎస్ఐ గాయత్రి, గుడ్‌విల్ కంప్యూటర్స్ నిర్వాహకుడు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ బూత్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని హత్య

భవన నిర్మాణ కార్మికుడు మురళి హత్యోదంతంలో నిందితుల అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుడు మురళి హత్య కేసులో ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ పావని తెలిపారు. స్థానిక గ్రామీణ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ క్వారీ సమీపంలో గత నెల 14న క్రాస్‌రోడ్డు ఎస్సీ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మురళి (47) దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన రూరల్ సీఐ కళా వెంకటరమణ బృందం నిందితులను గుర్తించినట్లు తెలిపారు. మదనపల్లె మండలం కొత్త కూరాకులపల్లెకు చెందిన పాకాల కిరణ్‌కుమార్ (22), పోతబోలు పంచాయతీ జెండామానువీధికి చెందిన సయ్యద్ ఖాదర్‌బాషా (53)లను అరెస్టు చేసి విచారించగా.. హత్య వివరాలు బయటపడ్డాయన్నారు. మేస్త్రీ ఖాదర్‌బాషా వద్ద మురళి, అతని భార్య భవన నిర్మాణ పనులు చేస్తారు. ఈ నేపథ్యంలో మురళి భార్యతో మేస్త్రీ ఖాదర్‌బాషా వివాహేతర బంధం పెట్టుకున్నాడు. ఈ విషయం మురళికి తెలియడంతో దంపతులు అతని వద్ద పని మానేశారు. ఈ క్రమంలో ఖాదర్‌బాషా పలుమార్లు మురళి భార్యతో మాట్లాడేందుకు యత్నించగా ఆమె పట్టించుకోలేదు. దీంతో మురళిపై కక్ష పెంచుకున్న ఖాదర్‌బాషా తన వద్ద పనిచేసే కిరణ్‌కుమార్‌తో కలిసి మురళిని అడ్డు తొలగించుకునేందుకు పథకం వేశాడు. గత నెల 14న మద్యం తాగేందుకు పిలిచి.. అతనితో ఎక్కువగా మద్యం తాపించి ఇద్దరు కలిసి తలపై బండరాయితో మోది.. పెట్రోలు పోసి నిప్పు పెట్టి పరారయ్యారు. సాంకేతికత ఆధారంగా మదనపల్లె - తిరుపతి మార్గంలోని టిడ్కో ఇళ్ల సమీపంలో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం సీజ్ చేశామన్నారు. హత్యకు వినియోగించిన బండరాయిని స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్ఎల్ రిపోర్టుకు పంపినట్లు తెలిపారు. రూరల్ సీఐ కళా వెంకటరమణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

రామసముద్రం, న్యూస్‌టుడే: గొర్రెలు మేపేందుకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పదస్థితిలో ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఈ ఘటన రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ మొరుంపల్లెలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చలపతి(55) గొర్రెలు మేపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో సాయంత్రం చెరువుకట్ట కింద చెట్టుకు ఉరేసుకుని వేలాడుతున్నాడు. ఎవరైనా హత్య చేసి ఉరి వేశారా లేక అతనే ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతుడికి భార్య రాధమ్మ, కుమారులు హరీష్, కిరణ్ ఉన్నారు. కుమారుడు హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి సుధాకర్‌రెడ్డి (62) మృతి చెందిన ఘటన మంగళవారం పీలేరులో చోటు చేసుకుంది. పట్టణంలోని కడప మార్గం కేవీఆర్ లాడ్జికి ఎదురుగా నివాసముంటున్న ఆయన ఉదయం నడకకు కడప మార్గంలోకి వచ్చారు. నడుస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయన్ను స్థానికులు గుర్తించి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీలేరు పోలీసులు తెలిపారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెఫెసి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ – 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ పి. శ్రావణ్ కుమార్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 81217 65159
ఆస్తి తనిఖీ కొరకు : 8332835007

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోదగిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకము ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: శ్రీమతి పగడాల సుమలత, ... డి.నెం.4-96బి, పెట్రోల్ బంక్ దగ్గర, ఈశ్వరమ్మ కాలనీ, మదనపల్లి, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 517325 ... సుమలత, తండ్రి : పగడాల నాగరాజు, డోర్ నెం.14-41-2, ఎన్‌వీఆర్ పార్క్ వెనుక వైపు, భవానీ నగర్, ... మదనపల్లి, అన్నమయ్య జిల్లా. వారు డిమాండ్ నోటీసు తేది 10-09-2024 ప్రకారం తేది.10-09-2024 ... మొత్తము రూ.40,33,674/- ... తేది.21-05-2026న విక్రయించబడునని ... [illegible]

షెడ్యూలు ఆస్తి వివరములు

చిత్తూరు జిల్లా, ప్రస్తుతం అన్నమయ్య జిల్లా, మదనపల్లి సబ్ - జిల్లా, మదనపల్లి మండలం, ... ఎలకపల్లి కుంట ఏరియా, సర్వే నెం.346-2 లోని డోర్ నెం.14-41-2, ... తూర్పు : ఎమ్. సుబ్రమణ్యం గారి ఇల్లు, పడమర : రోడ్డు, ఉత్తరం : శంకర్ నాయక్ గారి ఇల్లు, దక్షిణం : ... [illegible]

రిజర్వు ధర : రూ. 45,00,000/- | ధరావత్తు : రూ.4,50,000/- | బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 21-05-2026, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

[illegible]

www.sbi.co.in ... https://baanknet.com/eauction-psb/x-login ... https://baanknet.com ... 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.com ... [illegible]

తేదీ: 05-05-2026, ప్రదేశం: విజయవాడ | సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్తంభం ఎక్కిన సిబ్బందికి విద్యుదాఘాతం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో క్షేత్రస్థాయి విద్యుత్తు సహాయ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన చౌడేపల్లె మండలంలో చోటు చేసుకుంది. లద్దిగం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో గడ్డంవారిపల్లె పంచాయతీ చిన్నకంపల్లెకు చెందిన నిరంజన్‌రెడ్డి క్షేత్రస్థాయి సహాయకుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ లైన్ బాగు చేయడానికి ఎల్‌సీ తీసుకున్నారు. స్తంభం పైకి ఎక్కి పని చేసేందుకు యత్నించగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. 20 నిమిషాల తరువాత లైన్ ట్రిప్ అయిందని ఉపకేంద్రం సిబ్బంది చెబుతున్నారు. అప్పటికే నిరంజన్ కుడిచేయి పూర్తిగా కాలి స్తంభంపై నుంచి కిందపడ్డాడని స్థానికులు తెలిపారు. ఇతని పరిస్థితి విషమించడంతో పుంగనూరు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సల అనంతరం బెంగళూరు తరలించారు. ఎల్‌సీ రిటర్ను చేసిన తర్వాత ప్రమాదం జరిగిందా.. లేదా ముందే ప్రమాదం జరిగిందా.. అనే అంశంపై స్పష్టత లేదు. బాధితుడు కోలుకున్న తర్వాత వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఈ విషయమై ఏఈ శశిధర్‌ను వివరణ కోరగా నిరంజన్‌ను ఆసుపత్రిలో చేర్పించామని.. కోలుకున్న తరువాత వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

డిష్ యజమాని దుర్మరణం

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో డిష్ యజమాని మృతి చెందిన ఘటన పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. డిష్ యజమాని జామకాయల నాగరాజు (53) మంగళవారం సమీపంలోని బాబాజాన్ అనే వ్యక్తి ఇంట్లో టీవీ మరమ్మతు చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురయ్యాడు. బాధితుడ్ని వెంటనే బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ పరమేశ్‌నాయక్ తెలిపారు.



నాగరాజు (పాతచిత్రం)

విలాసాలకు అలవాటుపడి.. చోరీలకు పాల్పడి

- అంతర్ జిల్లా గొలుసు దొంగల ముఠా అరెస్టు
- రూ.11.62 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆరు కేసుల్లో నిందితులుగా ఉన్న అంతర్ జిల్లా గొలుసు దొంగల ముఠాను వాల్మీకిపురం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలో జరుగుతున్న వరుస చోరీలపై రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో వాల్మీకిపురం సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ తిప్పేస్వామితో పాటు పలువురిని బృందంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందం నిందితులను గాలిస్తుండగా మదనపల్లె - తిరుపతి మార్గంలో ఏటిగడ్డ శివాలయం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలను పట్టుకుని విచారించారన్నారు. వీరు గొలుసు చోరీలతో పాటు తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నట్లు తేలిందన్నారు. నిందితులు కలికిరి మండలం మహల్‌కు చెందిన రెడ్డెప్ప (30), మదనపల్లెలో ఉంటున్న మరంపల్లెవాసి సుబ్రహ్మణ్యం (38), మహల్ క్రాస్‌కు చెందిన అరవ లోకేష్ (32), బర్లపల్లె అంజలి (28), బర్లపల్లె సుజాత (45)లను అరెస్టు చేసి వారి నుంచి రూ.11,62,500 విలువ చేసే బంగారు నగలు, నాలుగు చరవాణులు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు. వీరిలో మగవారు దోచుకొచ్చిన నగలను మహిళలు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో ఉంచి డబ్బు తీసుకొచ్చి విలాసవంతంగా గడిపేవారన్నారు. ఎక్కువ డబ్బు సంపాదించాలన్న దురాశతో వీరు నేరాలకు పాల్పడుతున్నట్లు తేలిందన్నారు. వీరిపై గుర్రంకొండ, వాల్మీకిపురం, కలకడ, చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలాల్లో కేసులు ఉన్నాయన్నారు. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల్లో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని గొలుసు చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ వెంకటాద్రి, డీఎస్పీలు కృష్ణమోహన్, పావని అభినందించారు.

EENADU Classifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై అన్ని తరగతులకు మార్టిగేజ్ లోన్స్. స్థిరాస్తిలోన్ ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్లపై 2nd మార్టిగేజ్‌లోన్. ప్రత్యేకంగా Govt. Emp., రిటైర్డ్ పెన్షనర్లకు పర్సనల్ లోన్స్. నో సిబిల్, No IT. అయోధ్య కో ఆపరేటివ్ బ్యాంక్, RC రోడ్, తిరుపతి, 93969 99669

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డుకు ABAavas Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు, RERA PROJECT ✆95055 02346

JOBS

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోటానికి స్త్రీ/పు ఆయా, నర్సులు, వంట వారు, RMP, డ్రైవర్స్ కా. జీ: 15-40K. ఫ్రీ రూం + భో॥ HYD. ✆ 8317512135.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను / పేషెంట్సును / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 20K. ✆ 85209 80099, 85208 74499

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో, జీ. 20K ✆ 99120 11499, 99120 11899

SECURITY GUARDS

సూళ్లూరుపేటలోని సంతవేలూరు వద్ద సెక్యూరిటీ SO కావలెను. 10th (or) Inter, 12 గం. డ్యూటీ. జీతం: 18000/-. Contact: 72880 04466

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు... 80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.